క్లుప్తంగా

ఉపాధి క్షేత్ర సహాయకులకు సిమ్‌కార్డుల పంపిణీ



సిమ్‌కార్డులు అందిస్తున్న నార్సింగి ఎంపీపీ సబిత

రామాయంపేట(మెదక్): ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులకు ప్రభుత్వం నుంచి సిమ్‌కార్డులు మంజూరయ్యాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి ఎంపీపీ చిందం సబిత సూచించారు. సోమవారం నార్సింగి ఎంపీపీ కార్యాలయంలో క్షేత్ర సహాయకులకు సిమ్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధి పనులతో నిరుపేద కూలీలకు లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనందమేరి, ఇతర అధికారులతో పాటు ఉపాధి హామీ ఏపీవో, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కులు అందిస్తున్న సర్పంచ్ పరశురాంరెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం వరంలా మారిందని సర్పంచ్ పరశురాంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అజ్జమర్రి గ్రామానికి చెందిన నీరుడి హనుమంతుకు రూ. 60 వేలు, చాకలి పావనికి రూ.12 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోచయ్య, నాయకుడు పాపయ్య తదితరులు ఉన్నారు.

పల్లెల్లో అంత్యోదయ గ్రామసభలు



గామసభ నిర్వహిస్తున్న సర్పంచ్ మహిపాల్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో అంత్యోదయ గ్రామసభలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, కాళ్లకల్‌లో సర్పంచ్ మల్లేశ్, కోనాయపల్లి(పీటి)లో సర్పంచ్ ప్రభావతి ఆధ్వర్యంలో మిషన్ అంత్యోదయ గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో గ్రామాల స్థితిగతులు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు శంకర్‌గౌడ్, రూప, నవీన్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కామారం గ్రామంలో మిషన్ అంత్యోదయ గ్రామసభను నిర్వహించారు. సోమవారం కామారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ యాదగిరి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ కార్యదర్శి సుమలత, వార్డు సభ్యులు, ఐకేపీ, అంగన్‌వాడీ అధికారులు తదితరులున్నారు.

28న హనుమాన్ చాలీసా పారాయణం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

రామాయంపేట(మెదక్): వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణానికి సంబంధించి కరపత్రాలను సోమవారం రామాయంపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సత్యం మాట్లాడుతూ.. పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 28న వేలాది మంది భక్తులతో రామాయంపేటలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా 108 మంది దంపతులతో యజ్ఞం, హనుమాన్ పూజలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమానికి అతిథులుగా భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు, గీతా గాన ప్రవచన ప్రచారకర్త గంగాధరశాస్త్రీ, వివిధ మతాల పీఠాధిపతులు, తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాతృశక్తి సంయోజిక అనంతలక్ష్మి, సేవా ప్రముఖ్ రామానుజ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి నీల శ్యాం, కోశాధికారి ఎర్రం ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై చర్యలు తీసుకోండి

నర్సాపూర్ మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు



మాట్లాడుతున్న ఎంపీపీ నర్సింగ్‌రావు, పక్కన సీఈఓ శైలేష్‌కుమార్ తదితరులు

నర్సాపూర్: గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షుడు నర్సింగ్ రావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సర్పంచ్‌లు జితేందర్‌రెడ్డి, శ్రీశైలం, వెంకటేష్‌గౌడ్, శ్రీరాములు, వెంకటలక్ష్మి, సామ్యానాయక్, రాజు, శివకుమార్ తదితరులు మాట్లాడుతూ.. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యం అమ్ముతున్నారన్నారు. గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ కూర్చొని మద్యం తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో బెల్టుషాపుల పక్క నుంచి మహిళలు నడవలేక పోతున్నారని వారు ఆరోపించారు. పలుచోట్ల అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయని వాపోయారు. ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపులపై తనిఖీలు చేపట్టాలన్నారు. జెడ్పీ సీఈఓ శైలేష్‌కుమార్ మాట్లాడుతూ.. రెండు నెలల్లో మీ శాఖ తరఫున ఎన్ని కేసులు చేశారని ఎక్సైజ్ ఎస్‌ఐ అరుణను ప్రశ్నించగా, ఒక కేసు నమోదు చేశామని ఆమె చెప్పారు. పెద్దచింత కుంట సర్పంచ్ శివకుమార్ మాట్లాడుతూ.. తమ గ్రామంలోని ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. తమ గ్రామ పరిధిలో 15 ఎకరాల భూమి కబ్జాకు గురైందని సర్పంచ్ సామ్యానాయక్ ఆరోపించారు.

బిల్లులు ఇవ్వరా?

పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో పలు రకాల పనులు చేయించారని, నెలలు గడుస్తున్నా ఇంతవరకు బిల్లులు రాలేవని సర్పంచ్‌లు జితేందర్‌రెడ్డి, వెంకటలక్ష్మి, శ్రీరాములు, శ్రీశైలం, వెంకటేష్‌గౌడ్, రాజు తదితరులు ఆరోపించారు. పనుల కోసం అప్పుల పాలైనామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అద్మాపూర్ సర్పంచ్ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 80మంది విద్యార్థులకు ఒకే మూత్రశాల ఉందని, దీంతో పిల్లలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఈజీఎస్ పథకం ద్వారా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సీఈఓ సంబంధిత అధికారులను ఆదేశించారు. మన ఊరు – మన బడి కార్యక్రమం కింద ఆయా పాఠశాలలకు మరమ్మతులు చేపడితే ఆయా బిల్లులు త్వరగా వచ్చేందుకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ చెప్పారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, ఎంపీడీఓ మార్టిన్‌లూథర్, తహసీల్దార్ ఆంజనేయులు, భగీరథ డీఈఈ ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌ఆర్‌ఓ అంబర్‌సింగ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి యాదగిరి

రామాయంపేట(మెదక్): గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి రూ. పది లక్షలు ఉపాధి హామీ నిధులు మంజూరైనందున త్వరలో పనులు ప్రారంభిస్తామని సర్పంచ్ సుజాత అన్నారు. నార్సింగి మండలంలోని సంకాపూర్ గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో గ్రామంలో నెలకొన్న సమస్యల విషయమై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో కొత్త వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయినందున త్వరలో వినియోగంలోకి తీసుకొస్తామని వెల్లడించారు. మండల వ్యవసాయ అధికారి యాదగిరి మాట్లాడుతూ.. మండల పరిధిలో 34.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. సభలో పంచాయతీ సభ్యులు సిద్దాగౌడ్, రేఖ, అనిల్, కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే పంట ఎదుగుదల



టేక్మాల్(మెదక్): బొడ్మట్‌పల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రాం ప్రసాద్



అల్లాదుర్గం(మెదక్): గడిపెద్దాపూర్ శివారులో..



రేగోడ్(మెదక్): జొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ జావిద్

టేక్మాల్(మెదక్): పంట సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని పెద్దశంకరంపేట ఏడీఏ రాం ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని బొడ్మట్‌పల్లి పలువురి రైతులతో పాటూ గ్రామానికి చెందిన రైతు సుదర్శన్‌రెడ్డి వరి పంటను పరిశీలించి, సూచనలు చేశారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే వరి పంటను కాపాడుకోవచ్చని మండల వ్యసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన చిలప్‌చెడ్ మండలంలోని చండూర్, శీలాంపల్లి గ్రామాలలో వరి పంటలను పరిశీలించారు. ఏఈఓ భూపాల్, రైతులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

రేగోడ్(మెదక్): మండలంలోని సిందోల్, ఆర్.ఇటిక్యాల గ్రామాల్లో సోమవారం ఏఓ జావిద్ జొన్న పంటను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించామని ఏఓ చెప్పారు.

అల్లాదుర్గం(మెదక్): అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండలంలో వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేట, తిమ్మాపూర్, ధర్మాసాగర్ గ్రామాల్లో వరి, మొక్క జొన్న పంటలను ఏఓ స్వప్న పరిశీలించారు. ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

'గడా' ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి



భవనాన్ని పరిశీలిస్తున్న ముత్యంరెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని, పంచాయతీ రాజ్ నిధులను వినియోగించుకోవాలని గడా ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కోనాయపల్లి(పీటి), దండుపల్లి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా కోనాయపల్లి(పీటి)లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వీరి వెంట పీఆర్ డీఈ నర్సింలు, మండల నాయకులు చంద్రశేఖర్, సర్పంచ్ ప్రభావతి, కార్యదర్శి నవీన్‌కుమార్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 21న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కౌడిపల్లి, భుజిరంపేట 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. కౌడిపల్లి 132/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున అంతరాయం ఏర్పాడుతుందన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలన్నారు.

క్షీరాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: సెర్ప్ ఉద్యోగులు సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ముందుగా కలెక్టర్ రాజర్షిషాను కలిసి సన్మానించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సీఎం కేసీఆర్ చిత్ర పటానికిక్షీరాభిషేకం చేశారు.

కనీస వసతులు కల్పించండి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

మెదక్ కలెక్టరేట్: డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద కనీస వసతులు లేక అనేక అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కనీస వసతులు కల్పించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు కనీస వసతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గత ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా.. అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు.

టేక్మాల్ మార్కెట్ వేలం పూర్తి

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్‌లో ప్రతీ శనివారం జరిగే వారంతపు సంత తైబజార్ వేలాన్ని సోమవారం సర్పంచ్ సుప్రజా ఆధ్వర్యంలో ఈఓ రాకేష్ నిర్వహించారు. మేకల సంతను రూ. 23 లక్షల 8 వేల 5 వందలకు గ్రామానికి చెందిన చింత శంకరయ్య దక్కించుకున్నారు, తైబజార్ కూరగాయల సంతను రూ. 11 లక్షలకు గ్రామానికి చెందిన ఎండీ మతిన్, పశువుల సంతను రూ. 12 లక్షల 50 వేలకు గ్రామానికి చెందిన తలారి కిషన్ సొంతం చేసుకున్నారు.

'కమ్యూనిటీ హాల్‌కు భూమి లాక్కుంటున్నారు'



మాట్లాడుతున్న జగిర్యాల భూ బాధితులు

మెదక్ కలెక్టరేట్: మా ఇళ్ల స్థలాలు ఆక్రమించి కమ్యూనిటీ భవనం నిర్మించడం ఎంత వరకు సమంజసమని రేగోడ్ మండలం జగిర్యాల గ్రామ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ రాజర్షిషాకు ఫిర్యాదు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము బతుకుదెరువు కోసం పట్నం వలస వెళ్లగా, గ్రామంలోని మా నివాస స్థలం ఆరు గుంటల భూమిలో అధికారులు కమ్యూనిటీ భవనం నిర్మిస్తున్నారని తెలిపారు. ఇక్కడ మా తాతల సమాధులు సైతం ఉన్నాయని, ఈ విషయమై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా పహణి ఇచ్చారని చెప్పారు. కానీ ఆ భూమిలోకి వెళితే మీపై చర్యలు తీసుకుంటామని బెదిరించారని వాపోయారు. గ్రామానికి చెందిన పలువురు మా భూమిపై కన్నేసి అధికారులకు సహకరిస్తున్నారని చెప్పారు. వీరిపై చర్యలు తీసుకొని మా భూమిని మాకు ఇప్పించాలని కోరారు.

'అనుమతిలేని నిర్మాణం ఆపేయాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జగ్గంపేట యువకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని జగ్గంపేట గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు ప్రార్థనాలయం (చర్చి) నిర్మాణ పనులు చేపట్టారని, ఆ పనులను ఆపేయాలని గ్రామ యువకులు తహసీల్దార్ ముసాద్దిక్, ఎంపీడీఓ శశిప్రభలకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఈ సందర్భంగా జగ్గంపేట యువకులు మాట్లాడుతూ.. గ్రామంలోని పొలాలకు వెళ్లే చెరువు కాల్వ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి, గ్రామ శివారులో కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రార్థనాలయ నిర్మాణం చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు రవి, యువకులు మల్లేశం, మధు, భాస్కర్, సంగమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవం



టేక్మాల్(మెదక్): తంప్లూర్‌లో సాముహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని తంప్లూర్‌లో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతిపూజ, పుణ్యావాచనం, అఖండదీపారాధన, గోపూజ, రక్షాబంధనం, స్వామి వారికి జలాభిషేకం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. మార్నూరి నరహరి ఆచార్యులు హైదరాబాద్ బృందం వారితో సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం స్వామివారి కల్యాణం, విగ్రహాల ఊరేగింపు ఉంటుందని, భక్తులు అధిక సఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్) గ్రామంలో వీరవేంకట సత్యనారాయణ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు.

మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా నరేష్



అధ్యక్ష, కార్యదర్శులు దొంతి నరేష్, ప్రసాద్

మెదక్ రూరల్: మెదక్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా దొంతి నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. సోమవారం మెదక్ పట్టణంలోని రైస్ మిల్లర్ల వసతి గృహంలో యూనియన్లకు అతీతంగా ప్రెస్‌క్లబ్ ఎన్నిక నిర్వహించారు. మొత్తం 78 ఓట్లు పోల్ కాగా దొంతి నరేష్ గౌడ్‌కు 62 ఓట్లు, వీరు కుమార్‌కు 14 రాగా రెండు ఓట్లు చెల్లలేదు. 48 ఓట్ల మెజార్టీతో నరేష్ గౌడ్ గెలుపొందారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శి పదవికి ప్రసాద్, ప్రకాష్, భువన్ కుమార్ పోటీ పడ్డారు. 78 ఓట్లు పోల్ కాగా ప్రసాద్‌కు 50 ఓట్లు, ప్రకాష్‌కు 25, భువన్ కుమార్‌కు మూడు ఓట్లు వచ్చాయి. ప్రసాద్ 25 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రెండేళ్ల కార్యవర్గం కొనసాగనుంది.

పరీక్ష సామగ్రి అందజేత



తూప్రాన్: పరీక్ష సామగ్రి తో విద్యార్థులు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ ఉన్నత పాఠశాలలో మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ మజార్ ఆధ్వర్యంలో సోమవారం పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని జెడ్పీటీసీ సర్వని సరోజ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వసంత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, నాయకులు సుధాకర్, లక్ష్మణ్, కిషోర్, ఆకులపల్లి పాపయ్య, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్: పట్టణంలోని 8వ వార్డులోని మహాత్మా జ్యోతిబాపులే ప్రభుత్వ బాలికల పాఠశాల పదోతరగతి విద్యార్థినులకు జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందజేశారు. సంస్థ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వేస్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, మేనేజర్ ప్రవీణ్ కుమార్, హెచ్‌ఆర్ సతీష్ కుమార్, పట్నాయక్, ఫౌండేషన్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని గ్రామ యువకుడు సాదు హరికృష్ణ సోమవారం అందజేవారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కంటి వెలుగు శిబిరం పరిశీలన

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని టెంకటి గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఆప్తాలమిక్ అధికారి శ్యాంరావు పరిశీలించారు. కంటి వెలుగు నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇందులో క్యాంపు డాక్టర్ శ్రీ హర్ష, డీఈఓ సంజయ్, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్, ఏఎన్‌ఎంలు నాగమణి, సంతోష ఉన్నారు.

◆ ఘనంగా మల్లన్న వార్షికోత్సవాలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కొండాపూర్‌లో గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మల్లన్నకు బోనాలు సమర్పించి, మొక్కులను తీర్చుకున్నారు. కాగా రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్‌ల ఫోరం అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మల్లన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట రమేశ్‌యాదవ్, నరేష్, రాహుల్‌రెడ్డి, గులాం, వెంకట్, సత్యనారాయణగౌడ్, భాస్కర్‌యాదవ్ తదితరులున్నారు.

◆ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా నరేందర్



మెదక్‌జోన్: ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా బండ నరేందర్ నియామకమయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాశ్ ముదిరాజ్ మెదక్ పట్టణానికి చెందిన బండ నరేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాన్ని అందించారు.

◆ దుబ్బాక ధర్నాకు తరలిన బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): నియోజకవర్గ కేంద్రం దుబ్బాకలో బీజేపీ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీని నిరసిస్తూ నిర్వహించిన దీక్షలో పాల్గొనేందుకు చేగుంట బీజేపీ నాయకులు సోమవారం తరలి వెళ్లారు. దుబ్బాక తరలిన వారిలో దుబ్బాక నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, మండల అధ్యక్షుడు భూపాల్, పట్టణాధ్యక్షుడు సాయిరాజ్, చందు, సాయి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

◆ క్రికెట్ టోర్నమెంట్



కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామంలో వారం రోజుల నుంచి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ఫైనల్ మ్యాచ్ రంగంపేట, వరిగుంతం గ్రామాల మధ్య సాగింది. రంగంపేట జట్టు ఐదు వికెట్లతో విజయం సాధించింది. రంగంపేట సర్పంచ్ సుజాత, జిల్లా బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్ కుమార్‌మూర్తి విజేత జట్టుకు రూ. 20వేలు, రన్నరప్ కు నగదు బహుమతులను అందజేశారు. నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

◆ సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపాలి



నర్సాపూర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లిగోపి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో చేపట్టిన నిరసన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు రమేష్‌గౌడ్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

● ఉగాది నుంచి నాలుగు రోజుల పాటు వేంకటేశ్వరస్వామి జాతర



వెల్మకన్నలోని రాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం

కౌడిపల్లి(నర్సాపూర్): భక్తులు కోరిన కోరికలు తీర్చే దైవంగా వెలుగుతున్న మండలంలోని వెల్మకన్నలోని అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీరాయగిరి వేంకటేశ్వరాస్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా ఈనెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజులు పాటు బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అయిందని ఆలయ భజనమండల సభ్యులు తెలిపారు.

- వెల్మకన్నలోని శ్రీరాయగిరి వేంకటేశ్వరాస్వామి ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉందని గ్రామస్తులు తెలిపారు. ప్రతీ శనివారం భక్త మండల సభ్యులు రాత్రి భజనలు చేస్తారు.

వివరాలు

ఈనెల 22న ఉగాది సందర్భంగా ఉదయం శ్రీవారికి అభిషేకం, కంకణ ధారణ, అఖండదీపారాధన, ధ్వజారోహణం, సాయంత్రం బండ్ల ఊరేగింపు, రాత్రి గరుడ వాహన సేవ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు.

- 23న ఆరాధన, కుంకుమార్చన, పాచిబండ్ల ఊరేగింపు, అశ్వాహన సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు.
- 24న ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, సాయంత్రం శ్రీవారి తిరుకల్యాణం, లంకదహనం, రథం ఊరేగింపు.
- 25న శ్రీవారి చక్రస్నానం, అభిషేకం, ధ్వజరోహనం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.